# వనితావతంసము

బులుసు వేంకటేశ్వరకవిగారు

జన్మించినది అంత్యకులమున దారిద్ర్యతాపసీనివాసగృహమున; అర్పింపఁబడినది ఆధారములేని నిరుపేదకు; జీవించినది యిరువదినాలుగువత్సరములు; అల్లివైచినది విమలకీర్తిప్రభారేఖలను; వినుతిఁగాంచినది అజ్ఞానాంధకార కుగ్రామాకాశవీథిని విద్యుత్తరంగమువలె వెలుగొంది; నిర్వహించినది స్వధర్మమును; చూపినది సర్వమానవసౌభ్రాతృత్వము; చిలుకరించినది సర్వజీవులపైఁ బ్రేమరసము; కాంచినది జీవితపరమార్థ దృక్పథము; చేరినది సంక్రాంతిదినమున స్వర్గలోకమును; పేరుఁగాంచినది వనితావతంసమని. ఇది గంగమ్మ జీవిత సంగ్రహము.

వేకువనే మేల్కాంచుట, స్వగృహకృత్యముల నిర్వర్తించుట, ఇంతలో మేలుకువఁగన్న భర్తపాదంబులఁబడి హృదయపూర్వకభక్తిం జూపుట, మేల్కాంచిన బిడ్డల నమృతతుల్య కుచక్షీరములఁ దృప్తినొందించుట, ఇంతలోఁ దెలతెలఁ దెల్లవార మెల్లమెల్లన భర్తకడ సెలవుఁగైకొని బిడ్డల సంరక్షణార్థము అనుంగుపెద్దకూతుం గృహంబుననుండనునిచి యెడపిల్లంగొని గ్రామమున నుర్వీసురులయింటఁ జెంబులు నంట్లునుఁ దోమి వారుచెప్పిన పనులఁజేయుట, రెండుయామములగుసరికి బ్రాహ్మణస్త్రీలు భుజించిన పిదప నిడిన శేషాన్నంబుఁగొని సంతృప్తితో నిజగృహంబున కరుగుట, ఇంతలోఁ గూలిపనికేగిన భర్త తిరిగిరా నెదురేగి తీసికొనివచ్చి కాళ్లఁగడిగి సరసోక్తుల నమందానందముతో భుజింపఁజేయుట, ఒకవంకఁ బిల్లల కన్నమిడుట, ఇంకొకవంక పసిపిల్లనికిఁ బాలనిచ్చుట, భర్త విశ్రాంతిఁగొన్నమీదట దాభుజించుట, ఇంతలోఁ జెంతనున్న స్త్రీలోకమునుఁ గూర్చుండఁజేసి యుచితమర్యాదలఁజేయుట, ప్రతిదినము తమకుభోజనమిడుచున్న రాట్నమును ముందరనిడుకొని సన్నని నూలుఁదీయుచు స్త్రీలోకమును పుణ్యపతివ్రతామతల్లుల కథలచేఁ దృప్తినొందించుచు వారి యభిమానంగొనుట, ఇంతలో మాధుకరమెత్తవచ్చిన మాదిగమంగని సరసవచనములఁబిలిచి తాను కడుపారభుజింపకుండ మిగిల్చిన యన్నంబును వానికొసంగి వానిచేఁ దీవనలఁగొనుట, మరల గ్రామములోనికేగి బ్రాహ్మణులింటి పనులగావించి చీకటిపడుసరికి గృహంబునకేతెంచుట, భర్త తెచ్చిన బియ్యమునువండి భక్తితో మొదట భర్తకిడి పిదప పిల్లలకిడి తుదకు శేషించినదానిలో మూడువంతులు కుక్కకును, పిల్లికిని, మాదిగవానికి దిగవిడిచి యొకవంతుఁదిని గృహకృత్యములఁ జేయుట, పిల్లలనెల్లర మెల్లగఁబరుండవెట్టి భర్తనిజపదపద్మంబుల నధికభక్తినొత్తి యాతని యా

నందవచనంబుల నూరడించి కనుకుపట్టిన పిదపఁ బక్క జేరుట, భగవంతుని యనేక రీతులఁ బ్రార్థించుట, సుషుప్త్యవస్థం బ్రవేశించుట, ఇది యాపె దినచర్య.

మండువేసవిని యెండలో గుండెలదుర నామె బ్రాహ్మణులయింటికేగు మార్గమునఁ గొనయూపిరితో నొకశునకము వడగొట్టి పడియుండెను. మానవసంచారము వీధుల యందెచటనులేదు. అట్టితరి కరుణారసంబుఁ జిలుకరించి యాశునకమునకు నీర్వోసి శైత్యోపచారములఁ జేసి నెమ్మదింపఁ జేసిన దొకనాఁడు గంగమ్మ. పిదప నామె పనికై బోవుచుండ నొకకాసులపేరామె కంటఁ బడెను. తక్షణ మా మాతృమూర్తి కన్నీరు నింపుచు దానినిఁ దీసి కనుపడిన వారికిఁజూపుచు ప్రతిగృహమునకుఁ దిరుగుచు తుదకామె యొక గృహముం జేరెను. ఆ గృహస్థులును తమపేరుకై పలవించుచుండిరి. ఆ గృహయజమాని యకారణముగా ననేకమారులు గంగమ్మ నేడ్పించినాడు. అప్పుడే శంకయులేక గంగమ్మ అమితానందముతో వారికొసంగి నమస్కరించి పోవుచుండ వారు బహుమతినంప నది తనకు వలదని తిరిగి పంపివేసినది. ఇవి గంగమ్మజీవితములోని చిన్ని బెణుకులు.

ఇటుల గంగమ్మ యిరువదినాలుఁగువత్సరములు గడపినది. ఆరుగురు బిడ్డలఁగన్నది. జీవయాత్ర నతిచమత్కృతిఁగ జేసినది. సంక్రాంతినాఁటిరేయి యథాప్రకారము ప్రక్కఁ జేరి పరున్నది. ఉదయమగుసరికి మృతజీవియైయున్నది. ఆయాసములేని మరణమెంత పుణ్యాత్ములకో సంభవింపదుఁగదా! అందును సంక్రాంతిదినమరణ మెంతటివారికోగదా! ఆమె నిర్వర్తింపవలసినపనుల నిర్వర్తించినది. ఊరందర హృదయములయందును విలువలేని స్థలములను సంపాదించికొన్నది. ఆహా! జీవికిఁగావలసిన దింకేమున్నది? ప్రతిదినమును గంగమ్మను స్మరించుకొనని వారూర నేలేరు. గంగమ్మజీవితము ధన్యము! ధన్యము! ధన్యము!

తనదు విధుక్తధర్మాల దనిపెనామె!
ఘనతర ప్రేమపూజలఁ గన్నదామె!
నాథునిహృదబ్జ సింహాసనమున నామె!
ధన్యురాలగు వనితావతంసమామె!

"ఇంకా వెదుకుతున్నావా? పోయినడబ్బులు దొరకలేదా"

"దొరకాయి మా చిన్నతమ్మునికి"

"అయితే ఏమిటి వెదుకుతున్నావింకా"

"మాచిన్నతమ్ముని"